
# సింగిల్ పేజి కథలు




ఆదివారం కావటంతో షణ్ముఖరావు ఇంట్లోనే వున్నాడు. అందులోనూ మే నెల ఎండలు భయపెడుతూ ఇంట్లోంచి బయటకు అడుగేయనివ్వటం లేదు.

వర్ధనమ్మ డైనింగ్ టేబుల్ మీద భోజనాలు సర్దింది. "రండి భోం చేద్దాం" ఆయన దగ్గరగా వచ్చి పిలిచింది.

"రాజేష్ ఇంకా రాలేదు కదా! వచ్చాక భోం చేద్దాంలే" అన్నాడు షణ్ముఖరావు భార్య ముఖంలోకి చూస్తూ.

"కాలేజీ వున్నప్పుడే వాడు కరక్ట్ టైమ్‌కి భోజనానికి రాడు. ఇక ఆదివారం వాడిష్టం. ఎప్పుడొస్తాడో తెలియదు. వాడి కోసం ఎదురు చూస్తూ కూర్చుంటే మనం ఏ సాయంత్రమో భోంచేయాలి. ఈ ఎదురుచూపులు వద్దుగానీ, మీరు రండి, భోంచేద్దాం" ఆవిడ వెనుతిరిగింది.

భార్య మాటల్లోని నిజం గుర్తుకొచ్చాక, మరేం మాట్లాడకుండా ఆయన ఆవిడను అనుసరించి వెళ్ళి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు.

ఇద్దరూ కలసి భోంచేసారు.

శలవు రోజు తనివితీరా నిద్రపోవటం, ఉద్యోగంలో చేరినప్పటి నుండి అలవాటయ్యింది. అందుకే ఆయన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి నడుము వాల్చబోతుంటే పక్కనే వున్న సెల్‌ఫోన్ మ్రోగింది.

ఆయన డిస్‌ప్లేకేసి చూసాడు. మనోహర్‌రావు నుండి ఆ ఫోన్ వచ్చింది. సాధారణంగా శలవురోజున మనోహర్ ఫోన్ చేయడు. మరి ఈ రోజు ఎందుకు ఫోన్ చేసాడో? అనుకుంటూనే రిసీవ్ బటన్ నొక్కాడు.

అవతలివైపు నుండి మనోహర్‌రావు కంగారుగా పలికాడు. "రేయ్ షణ్ముఖం! మన వేణుగాడికి సన్‌స్ట్రోక్ తగిలి హాస్పిటల్‌లో జాయినయ్యాడు. ఈ విషయం నాకూ ఇప్పుడే తెలిసింది. నేను హాస్పిటల్ దగ్గరకు వెళ్తున్నా. నువ్వూ హాస్పిటల్ దగ్గరకు వచ్చెయ్యి" హాస్పిటల్ డీటైల్ చెప్పాడు.

ఫోన్ కట్ అయ్యింది. అప్పుడే బెడ్‌రూమ్‌లోకి వచ్చిన వర్ధనమ్మ భర్తకేసి చూసి అడిగింది "ఎక్కడ్నుంచి ఫోన్?"

"మన మనోహర్ చేసాడు. వేణుకి సన్‌స్ట్రోక్ తగిలిందట. హాస్పిటల్‌లో జాయిన్ చేసాడు"

షణ్ముఖం, వేణు, మనోహర్ చిన్ననాటి స్నేహితులు గత యాభై సంవత్సరాలుగా వారి స్నేహం కొనసాగుతోంది. అందువల్లే భర్త ముఖంలో కదలాడిన బాధ గుర్తించిన వర్ధనమ్మ చిరుకోపంగా పలికింది. "ఐనా ఇంతగా ఎండలు మండిపోతుంటే వీధిలోకి వెళ్ళకూడదనే జ్ఞానం లేకుండా, అన్నయ్యగారిలా ఎండల్లో తిరగడం ఏమీ బాగోలేదండి. కాస్త కోలుకున్నాక ఈ విషయంలో ఆయనను హెచ్చరించండి. సరేనా?!"

ఆయన నిలువుగా తలాడించాక, హాస్పిటల్ వెళ్ళడానికి బట్టలేసుకున్నాడు. తలుపు తీసుకుని బయటకు వెళుతుంటే, వెనుక నుండి వర్ధనమ్మ అరిచింది.

"సన్‌స్ట్రోక్ తగిలిన మీ ఫ్రెండ్‌ని చూడడానికి ఎండలో వెళ్తున్నారు. మీకు సన్‌స్ట్రోక్ తగలకుండా చూసుకోండి"

ఆయనకు మరోసారి నిలువుగా తలూపక తప్పలేదు.

గేటు పక్కన స్కూటర్ వున్నా, సన్‌స్ట్రోక్‌కి భయపడి ఆటో పిలిచి ఎక్కి కూర్చున్నాడు షణ్ముఖరావు.

పది నిముషాల తర్వాత ఆటో హాస్పిటల్ ముందు ఆగింది. ఆయన హడావుడిగా హాస్పిటల్‌లోకి నడిచి, రిసెప్షనిస్ట్‌ని ఎంక్వయిరీ చేస్తే 'ఐసియు'లో జాయిన్ చేసారని తెలిసింది. 'సన్‌స్ట్రోక్ బాగానే తగిలినట్టుంది' మనసులోనే అనుకున్నారాయన.

ఐసియు దగ్గరకెళ్ళేసరికి వేణు భార్య ఏడుస్తోంది. అతడి కొడుకు ఏదో పెద్ద తప్పు చేసినవాడిలా తలదించుకుని వున్నాడు. ఆ పక్కనే నిలబడి వున్న మనోహర్ దిగాలుగా చూస్తున్నాడు.

షణ్ముఖరావు మనోహర్ దగ్గరగా వెళ్ళాడు. "డాక్టర్స్ ఏమంటున్నారు?" అడిగారు మెల్లగా.

"ఫస్ట్‌స్ట్రోక్ కదా, ప్రాణానికి ప్రమాదమేమీ లేదంటున్నారు. కానీ మరోసారి స్ట్రోక్ రాకుండా వుండాలంటే ఫ్యామిలీ మెంబర్స్ చాలా జాగ్రత్తగా వుండాలంటున్నారు"

"అవునవును. ఎండలోకి అసలు వెళ్ళనివ్వకూడదు"

మనోహర్ మిత్రుడికేసి అయోమయంగా చూసాడు. "హార్ట్ ఎటాక్‌కి, ఎండలోకి వెళ్ళడానికి సంబంధమేమిటి?"

షణ్ముఖరావు మనోహర్‌కేసి అమాయకుడిని చూసినట్టు చూసి, ఆ తర్వాత పలికాడు. "సన్‌స్ట్రోక్ మరోసారి తగలకుండా చూసుకోవాలంటే ఎండలోకి వెళ్ళకూడదు కదా! ఎండలోకి వెళ్తే సన్‌స్ట్రోక్ తగులుతుంది"

మనోహర్ పది సెకనులు తలగోక్కున్నాడు. అప్పటికిగానీ ట్యూబ్‌లైట్ వెలగలేదు. అర్థంకాగానే తన్నుకొచ్చిన నవ్వును అతికష్టం మీద ఆపుకుంటూ "అంటే...నువ్వనేది ఆ 'సన్'స్ట్రోకా?" ఆకాశంకేసి చూపించాడు.

"అవును..మరి మనవాడికి తగిలింది ఆ సన్‌స్ట్రోకే కదా?" అప్పుడొచ్చింది ఆయనకూ చిరు అనుమానం.

"కాదు..మన వేణుకి తగిలింది. ఆ..ఆ 'సన్‌స్ట్రోక్ కాదు, ఈ సన్‌స్ట్రోక్" అంటూ వేణుకొడుకు అనూప్‌ని చూపించాడు.

షణ్ముఖరావుకి తల తిరిగినట్టనిపించింది. "ఈ..ఈ సన్‌స్ట్రోకా?" అన్నాడు అయోమయం, ఆశ్చర్యం కలబో సిన స్థితిలో.

"ఈమధ్యకాలంలో ఆ సన్‌స్ట్రోక్‌ల కన్నా, ఈ సన్‌స్ట్రోక్‌లు తల్లిదండ్రులకు బాగా తగులుతు న్నాయి. మారిన కల్చర్, సినిమాల ప్రభావంతో పిల్లలు ప్రేమలని, విదేశాలకు వెళ్ళిపోవటమని, కేసుల్లో ఇరుక్కోవటమని, ఏదో రూపంలో తల్లి దండ్రులకు షాక్‌లు, స్ట్రోక్‌లు ఇస్తున్నారు. మన వేణుగాడి కొడుకు ఎవరో అమ్మాయిని ప్రేమిస్తు న్నానని పెళ్ళి చేసుకుంటానని చెప్పేసరికి, అప్ప టికే తన చెల్లెలి కూతురితో నిశ్చయతాంబూ లాలు పుచ్చుకున్న వేణుగాడికి హార్ట్ఎటాక్ వచ్చింది. ఈ సన్‌స్ట్రోక్‌తో మనోడు హాస్పిటల్‌లో జాయినయ్యాడు" వివరించాడు మనోహర్.


షణ్ముఖరావుకి తన కొడుకు రాజేష్ గుర్తుకొ చ్చాడు. 'నాకూ భవిష్యత్‌లో సన్‌స్ట్రోక్ తగులు తుందా?' మనసులోనే అనుకున్నాడు.

'ఆ సన్‌స్ట్రోక్' తప్పించుకునేందుకు అనేక మార్గాలున్నాయి. 'ఈ సన్‌స్ట్రోక్'ని తప్పించుకునే మార్గాలున్నాయా?

-జె.సునీల్ (హైదరాబాద్)

OOO

# ఏది ముఖ్యం?



ప్రవీణ్ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే వాళ్ళబ్బాయి చింటూ "నాన్నా, నాన్న..నాకు ఈరోజు ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు కారు బొమ్మ తెస్తాను అని చెప్పావుకదా! ఏది" అని ముద్దు ముద్దుగా అడిగాడు. దానికి ప్రవీణ్ "రేపు తెస్తాను" అని చెప్పి లోపలికి వెళ్ళాడు. ఇంతలో ప్రవీణ్ భార్య హేమ వాళ్ళబ్బాయి చింటూ చిన్నబుచ్చుకున్న సంగతి గమనించి "రేపు తప్పకుండా కొని తెస్తారు లేరా" అని ఎత్తుకొంది.

డ్రస్ మార్చుకొని హాలులోకి వస్తున్న ప్రవీణ్‌తో ఎందుకండీ కారు బొమ్మ తేలేదు అని తన కొడుకు బుగ్గలు నిమురుతూ అడిగింది.

అప్పుడు ప్రవీణ్ చింటూని తన చేతులలోకి తీసు కొని "చింటూ నేను ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు షాపుకి వెళ్ళటం మర్చిపోయానురా! అందుకని మనం ఒక పని చేద్దాము. నీకు ఏం కావాలో ఒక బుక్ పెట్టి రాయి. అందులో నీకు ఏమి కావాలో గుర్తువచ్చినప్పుడల్లా, నీకు కొనుక్కోవాలి అనుకున్నప్పుడల్లా రాయి. నేను రోజు ఆఫీసుకు వెళ్ళేటప్పుడుడల్లా ఆ బుక్ ఓపెన్ చేసి చూసి నీకు కావలసినవి తెస్తాను. అని చెప్పి ఓ.కె.నా గుడ్ బై" అని చెప్పాడు. దానికి చింటూ మొహం వెలిగి పోయింది.

చింటూ వెంటనే వెళ్ళి ఒక పుస్తకాన్ని తీసుకొని వాళ్ళ అమ్మ దగ్గరకు వచ్చాడు. "ఏమిట్రా" అని వాళ్ళమ్మ అడి గింది. దాడి "నీకు కావలసినవి ఒక బుక్ పెట్టి రాయి అని చెప్పాడుగా..నువ్వు రాయి" అని అడిగాడు. దానికి వాళ్ళమ్మ "ఏవి రాయమంటావు?" అని అడిగింది. దానికి వాడు "రెడ్ కార్" అని చెప్పాడు. దానికి హేమ నవ్వుకొని "సరేరా" అని రాసింది. వెంటనే చింటూ "మమ్మి, మమ్మి" చాక్లెట్లు, పెన్, పెన్సిల్ ఇంకా బాల్, బ్యాట్, వాచ్ ఇలా చెబుతూంటే "చాలురా ఇవి తేనీ తరు వాత రాద్దాము' అంది. సరేలే అన్నట్లు వాళ్ళ అమ్మ వంక చూశాడు. ఇక రాత్రయింది. ఆ బుక్‌లో ఏమి రాయాలి అన్న ఆలోచనలు వాడికి బాగా పెరిగాయి. పగలంతా వాళ్ళ అమ్మతో అవి రాయి, ఇవి రాయి అని చెబుతూనే ఉన్నాడు. వాళ్ళ అమ్మ నవ్వుకుంటూ సహనంగా రాస్తూనే ఉంది. మరుసటి రోజు వాళ్ళ నాన్న ఆఫీసు నుంచి వచ్చినా వీడు పట్టించుకోలేదు. వాళ్ళనాన్న ఒక రోజు వాడిని పిలిచి ఇందులో "ఇన్ని రాశావు? రేపు ఏది తెమ్మంటావు?" అని అడిగాడు. వాడు ఆలోచనలో పడి పోయాడు. కొంచెం సేపు ఆలోచించి "ఇప్పుడు ఏమీ వద్దు రేపు చెబుతాను" అని అన్నాడు.

దానికి దంపతులిద్దరూ నవ్వుకున్నారు. చింటూ పెరిగి పెద్దవారయ్యాడు. కాలానుగుణంగా వాడిలో మార్పు వాడి కోరికలలో మార్పు వచ్చింది. ఈరోజు ఇది ముఖ్యం అనిపించినది రెండు రోజుల తర్వాత అది ముఖ్యం కాకుండా పోతున్నాయి. తల్లిదండ్రులు వాడికి అవసరమైనవి సమకూరుస్తూనే ఉన్నారు. నెలకొకసారి వాళ్ళ నాన్న ఇందులో ఏది కొనిపెట్టను? అని అడిగిన ప్పుడల్లా వాడు అయోమయంలో పడేవాడు. "ఏరా ఇది ఈరోజు తెచ్చేయవా అని అడిగితే వద్దు ఆలోచించి చెబు తాను" అనేవాడు. ఇంటర్ అయ్యింది. ఇంజనీరింగులో సీటు వచ్చింది. హాస్టలుకి వెళ్ళాలి అని అనుకున్నాడు. (చదువుకోవడానికి). బైక్‌కొనమని బుక్‌లో రాశావు కదా! బైక్ కొనమంటావా? అని వాళ్ళ నాన్న అడిగాడు. "హాస్టలుకు వెళుతున్నాను కదా? చదువైనాక కొనుక్కుం టాను" అని అన్నాడు. కాలం గడిచింది. చింటూ పెద్దవా డైనాడు. ఉద్యోగం వచ్చింది. వాళ్ళ నాన్న "బైక్ కొని వ్వనా?" అని అడిగాడు.

"వద్దు లోన్ తీసుకొని కొనుక్కొంటాను" అని చెప్పాడు. చింటూకి ఆ బుక్ చూసినప్పుడల్లా బాగా నవ్వు వస్తుంది. చిన్నప్పుడు నేను ఎన్ని కోరికలు కోరేవా డిని బాగా నవ్వుకొంటాడు. అందులో తన బాల్యం, యవ్వనం అన్ని తన ప్రవర్తనా తన ఆలోచన అన్నీ స్పష్టంగా కనబడతాయి. తల్లిదండ్రులు అనేవారు పిల్ల లకి అడిగిందల్లా కొనిపెట్టకుండా వాటి ప్రాముఖ్యతను, అవసరాన్ని చెప్పకుండానే చెప్పినట్లవుతుంది; ఆ బుక్ చూసినప్పుడల్లా, తన తల్లిదండ్రులు ఎంత గొప్పవారో ఆ బుక్ చూసినప్పుడల్లా చింటూ ఆనందపడుతుంటాడు.

-మాధురీరామ్ (హైదరాబాద్)